# కాపురం

## పెళ్ళి

జానకి పెళ్ళి అనుకోకుండా జరిగింది. తనకి తీరిక వున్నప్పుడల్లా తనపెళ్ళి సంఘటన కళ్ళ ఎదుట చూస్తున్నట్టు వూహించుకు తనలో తనే నవ్వుకునేది జానకి.

తను ఓ సారి బంధువుల యింట్లో పెళ్ళికి తల్లితో వెళ్లటం జరిగింది. అక్కడికి వాళ్ళ దూరపు బంధు ఒకామె వచ్చింది. ఆవిడ తనని చేరతియ్యటం, చిన్నతనంమూలాన్ని ఆవిడచుట్టూ తిరుగుతూ ఆవిడకి చిన్న చిన్న పనులు చేసి పెడుతూ ఆవిడని తనువదలకుండా తనని ఆవిడ వదలకుండా ఆ నాలుగు రోజులు కులాసాగా గడిచిపోయాయి. తనూ, తల్లి తిరిగి వచ్చేశారు.

తరవాత రెండు ఏళ్ళు గడిచాయి. అది వేసవికాలం అవటంచేత అంతా పందిట్లో పడుకున్నారు. తనూ పందిట్లో పడుకునేదే కాని, తన మంచం అక్కయ్య అత్తగారు ఆక్రమించుకుంది. తనని తమ్ముడు దగ్గర పడుకోమంది అమ్మ. నేను పడుకోను, ఆవిడనే పడుకోమని పట్టుపట్టింది తను. అమ్మ వీపు మీద వక్కటి అంటించింది. "ధానితో పెంకితనం ఎగిరిపోయి, బామ్మదగ్గర అరుగుమీద కిందపడుకుంది." "అమ్మడూ కిందపడుకున్నావు ఏమిరా" అంటూ తన కొంగుపైకి రెక్క పుచ్చుకులాగి పడుకోపెట్టుకుంది. ఆమె పక్క, పరుపు అక్కర్లేదు సరికదా దిండుకూడా పెట్టుకోదు. తన కొంగుపరుచుకు చెయ్యి తలకిందపెట్టుకు పడుకుంటుంది. ఆ రోజు అదికూడా తనకిచ్చి కిందపడుకుంది బామ్మ.

"పెళ్లీడు పిల్లకదా దాన్ని ఎందుకల్లా ఏడిపిస్తారు. పెళ్ళి అవుతే వాళ్ళు వుంచుతారా, అది వుంటుందా - మీ అమ్మకి మరీ వచ్చింది" అంటూ తన వీపు నిమురుతూ పడుకుంది బామ్మ.

ఇంకా చీకటివుండగానే, పిన్నివచ్చి అమ్మడూ లే అని నెమ్మదిగా లేపింది. పిన్నికి తోడుకావాలంటే తనను తీసుకువెళ్ళటం అలవాటు. అందుకేమో అనుకుని లేచి కూర్చుంది తను. "తొందరగా మొహం కడుక్కో జడవేస్తా" నంది పిన్ని.

తను మళ్ళా పడుకోబోయింది. 'లే తొందరగా కానీ, మళ్ళీ వర్షం వస్తుందిట' అంది తనకేమీ అర్థం కాలేదు. పిన్ని తనకి ముస్తాబు చేసింది. గజ్జలపట్టీడ తీసి పెట్టింది. అక్కయ్యకి అత్తారుపెట్టిన చంద్రహారంకూడా వేశారు. వాళ్ళ అత్తగారు వెనకాతలే వచ్చి "పెళ్ళివారు వచ్చారన్న సంబడంలో అదికాస్తా ఎక్కడేనా పూరేగించేవు జాగర్త" అంది వెటకారంగా.

"వాళ్లు" చూసుకోవటం, లాంఛనాలు వగైరా మాట్లాడటం హీలుగురోజుల వ్యవధిలో ముహూర్తం పెట్టడం, పెళ్ళి చాలా వైభవంగా జరిగిందని నలుగురూ అనుకోవటం అంతా చిత్రంగా జరిగిపోయింది. అన్నీ ఎల్లావున్న జానక్కి తగినట్టే రామచంద్రమూర్తి రావటం వింతగా లేదూ." అని అత్తయ్యలు వేళాకోళంచేశారు.

ఊరేగింపు అవుతోంటే "కాఫీ కావాలా" అని అతను, తనను అడగటం, ఆమాట కాస్తా వదిన అందరిదగ్గరకు మొయ్యటం అంతా తనను ఏడిపించటం వదిన, అక్క తనతో మూడునిద్దర్లకి రావటం, మళ్ళీ అతను తన స్నేహితుణ్ణి తీసుకువచ్చి తనను చూపించటం, స్నేహితుడు ఒక కర్పూరంబొమ్మ అతని చేతికిచ్చి తనకివ్వమనటం, ఇచ్చేటప్పుడు తమ యిద్దర్నీ ఫోటో తియ్యటం, తనకంటే పెద్దవాళ్లయినా, మరుదులు తనతో కబుర్లు చెపుతూ కూర్చోటం ఎంతో బాగున్నాయి ఆ మూడు రోజులూ, తరువాత ఇంటికి వచ్చేశారు తనూ అక్కా వదినాను. చుట్టాలు అంతా ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్ళారు.

ఈ ఏడాదిలో అత్తగారు వకటి రెండుసార్లు తనను తీసుకువెళ్ళినా, అమ్మవాళ్ళూ వెంటనే రెండురోజుల్లో తీసుకురావటం జరిగింది.

ఇంతలో అక్కకి కొడుకు పుట్టాడు. వాడి బారసాలకి వచ్చి, అత్తగారు, మామగారూ వాళ్ళతో పాటు తనను తీసుకువెళ్ళారు. ఈ సారి వాళ్ళతో వెళ్ళటం కొంచెము భయం వేసింది. పిన్ని, బామ్మ, అమ్మ కళ్లనీళ్ళు పెట్టుకున్నారు. బాబాయి వాళ్ళని కోప్పడి తనే కళ్ళు తుడుచుకుంటూ బండిదాకా సాగనంపాడు, తనక్కూడా ఎందుకో ఏడుపొచ్చి వెక్కివెక్కి ఏడ్చేసింది. బాబాయి తనకు ధైర్యం చెప్పి "మీ అత్తగారు అందరిలాంటిది కాదు చాల మంచిది. మళ్ళీ ఒక వారంలో నాన్నగార్ని పంపుతాను. తేకపోతే నేనైనా వస్తాను. నువ్వు బెంగపెట్టుకోవద్దు. మీ అత్తాగారింట్లో ఎవరు ఏమన్నా నువ్వు ఎదురు చెప్పకూడదుసుమా" అని చెప్పి, జేబులోంచి కొంత డబ్బుతీసియిచ్చి, "దగ్గర పెట్టుకో, ఏదయినా కావాలంటే మీ అత్తగారికిచ్చి కొనిపెట్టమను" అని చెప్పాడు.

"అక్కగారూ! మా అమ్మాయి లోపాలు ఏమన్నా వున్నా కడుపులో పెట్టుకోవాలి దానికి చిన్నతనం" అని చెప్పి మమ్మల్ని సాగనంపాడు. మా బండి కనబడేదాకా చూసి కళ్ళు తుడుచుకుంటూ వెళ్లిపోయాడు.

## కాపురం

ఈ సారి జానక్కి అత్తవారిల్లు చాలా కొత్తగా తోచింది. అత్తగారు ఎంత చనువుగా వున్న ఆవిడకి ఏమిచేస్తే కోపంవస్తుందో అని భయపడుతూ మసులుకోవటం మొదలెట్టింది.

మరుదులతో మాట్లాడేందుకు కూడా భయపడేది. జానకివచ్చి అప్పుడే యిరవై రోజులయింది. మామగారికి వడ్డిస్తో అత్తగారు, "రామానికి సెలవలు యిచ్చి యిన్నాళ్లయినా యింకా రాలేదేమిటండీ. తొందరగా రమ్మని రాయండి యివాళ" అంది. అంతలో తలుపు వెనకనిల్చున్న జానకిని చూసి "పిల్లా నీ మొగుడిని గురించి ఏమి చెప్పుకుంటున్నామో అని వింటున్నావా ఏమిటి" అని నవ్వుతూ, "మీ మరుదుల్ని పిల్చుకురా. మీకు కూడా పెడితే నాపని తెములుతుంది" అన్నారు. జానక్కి ఎందుకో గుండెలు కొట్టుకున్నాయి. తను నిజంగా వాళ్ళమాటలు వినేందుకే నిల్చుంది. అనుకుంటారేమోనని భయపడింది. ఇంకెప్పుడూ అల్లా చెయ్యకూడదు అనుకుంది.

ఇంకోవారం గడిచింది. రామం, ఇంకో ఇద్దరు స్నేహితులతోకూడా ఆరోజు వచ్చాడు. అతని పేరు రామచంద్రము అయినా అంతా రామం అనే పిలుస్తారు. స్కూల్లో, కాలేజీలో అటెండెన్సు వేసేటప్పుడూ, పెళ్ళిలో అమ్మాయిచేత అమ్మమ్మ చెప్పించినప్పుడూతప్ప అతన్ని పూర్తిపేరెట్టి పిల్చిన పాపాన పోలేదుట ఎవ్వరూను.

జానకిని అత్తగారు పిల్చి కాఫీ పట్టుకెళ్ళి యిచ్చిరా వాళ్ళకి అన్నారు. పట్టుకెళ్లేందుకు సిగ్గుపడి కదలకుండా నిల్చుంది.

"అంత సిగ్గయితే ఎల్లాగే, పిల్లా. పోనీ మురళిని పిలుపు యిస్తాడు". ఇంతలో రామం అక్కడికి రావటం, "చూడరా మీ ఆవిడ కుర్రపిల్లలా మారాంచేస్తోంది, కాఫీ తీసుకెళ్ళమంటే" అని అత్తగారనటం అతను తనకేసి తెరిపార చూసి నవ్వటం- తనకెందుకో గుండె గబగబ కొట్టుకుని ఒళ్ళు చచ్చిపోయినట్టయింది. పక్కింటి లక్ష్మి, "చూడు పిన్నీ! అన్నయ్యాని చూడగానే వదినె మొహం కందగడ్డలా ఎల్లా ఎర్రపడిందో" అంది.

"నువ్వు ఎప్పుడు వచ్చావే. నీ పెళ్ళి అవుతే నీ మొహమూ ఎఱ్ఱపడుతుందిలే.'

"పో పిన్నీ, ఏమి మాటలు, అమ్మ మిరప్పొడి యిచ్చి రమ్మంటే వచ్చా."

"ఆ కాస్తా యివ్వకపోతే ఏమి? మీ అమ్మదంతా సోజ్ఞం. ఆ గిన్న అక్కడపెట్టి ఆ కాఫీలు పట్టుకెళ్ళి వాళ్లకి యిచ్చిరా. పో" అని పురమాయించారు అత్తగారు.

రామం స్నేహితులు కులాసాగా వారం గడిపి వెళ్ళి పోయారు. జానక్కి అత్తగారు పువ్వులజడ వెయ్యటం సాయంత్రము తెల్లచీర కట్టుకోమనటం నిత్యకృత్యాల్లో వకటిగా అయింది.

ఆ రోజు అన్నీ సవరించి మామగారికి మంచినీళ్ళుపెట్టి అత్తగారికి పక్కేసి వెళ్ళేసరికి చాలా పొద్దుపోయింది. ఆయన ఇంకా చదువుకుంటూనే వున్నారు తనను చూడనట్టు. జానకి అలాగే నిల్చుంది చాలాసేపు. జాలేసిందో ఏమో అటుచూసి, "ఆ జడ వేసుకోవద్దంటే మానవా నువ్వు" అని కొంచెము కోపంగా అడిగారు. "మీ అమ్మే వేశారు" అని చెబుదామనుకున్నా, ఎవరో కంఠం నొక్కినట్టు మాటరాలాపైకి, "నేను తెచ్చిన సిల్కు చీర కట్టుకుని, ఆ జడ విప్పి వదులుగా అల్లుకురా" అని జానకికేసి చూడకుండానే ఆజ్ఞవేశాడతను.

జడ అయితే వేసుకోవచ్చు. చీర తెచ్చుకోవటం ఎల్లా? తన పెట్టి అత్తగారి మంచముక్రింద వుందాయె. ఆవిడ ఏమంటారో, ఆవిడకి మెళుకువస్తే ఏమి చెప్పటం? కట్టుకోకపోతే యీయన ఏమంటారో ఎటూ పాలుపోక గోళ్ళు గిల్లుకుంటూ నిల్చుంది జానకి. చూసిన వాళ్ళంతా తన జడని మెచ్చుకుంటారే, యిదేమిటి ఈయన జడ బాగాలేదంటారు. పోనీ విప్పి అల్లుకుందామని ముందుకు తీసుకుంది జడ. ఆ పువ్వుల్ని చూస్తే విప్పబుద్ధి పుట్టలా. చివరికి ఎల్లాగో విప్పి జడల్లుకుంది. తరువాత కొంచెము దగ్గరికి వెళ్ళి ధైర్యము తెచ్చుకుని, "నా పెట్టి మీ అమ్మగారి మంచముక్రింద వుంది. ఆవిడ లేస్తారేమో" అని

వణుకుతూవున్న కంఠముతో అంది.

"వూ" అని విసురుగా పుస్తకం బల్లపైకి విసిరివెళ్ళి పడుకున్నారాయన. పుస్తకంతీసి పక్కనపెట్టింది. దానికిందవున్న ఫోటోతీసి చూసింది. జానకికి కర్పూరపుబొమ్మయిచ్చిన అతను యింకో అతను వెనుక నిల్చున్నారు; ముందు ఈయనా పక్కగా వక అమ్మాయి కూర్చున్నారు. ఆఫోటోచూస్తే తనకి సిగ్గేసింది. పరాయివాళ్ల పక్క అల్లా కూర్చోవచ్చా? ఆ అమ్మాయి అంటే యిష్టమేమో. అందుకే తనని విసుక్కుంటున్నట్లున్నారు. ఈ ఆలోచనరాగానే వళ్ళంతా జెఋులు పాకినట్టయింది.

జానకి మొహం చూసి గ్రహించాడేమో తనని వెక్కిరించినట్లు నవ్వుతూ, "అమ్మాయిని చూడు ఎంత అందంగా అలంకరించుకుందో" అన్నారు.

జానక్కి వళ్ళు మండింది. ఆ పిల్లవి చిన్న చిన్న కళ్ళు. ఆ పిలకజడ ముందుకు వేసుకుంది. అల్లా వుంటేనే అందముగా వుంటారు కాబోలు. తనని ఎందుకు చేసుకున్నట్లు? జడ అయితే జుట్టు వూడితే చిన్నదవుతుంది. కాని కళ్ళు ఎల్లా చిన్నవవుతాయి. జానక్కి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కనపడకుండా గోడవేపు తిరిగి నిల్చుంది.

"పెద్ద జడ వుండటం ఒకందుకు వుపయోగం" అంటూ చేతికి చుట్టుకు ముందుకు లాగారు. తను కిందపడబోవటం, పడకుండా ఆపటం, పకాలున నవ్వటం....

జానకి లేచేసరికి చాలా ప్రొద్దెక్కింది. రామంకేసి చూసి సిగ్గుపడింది. ఫరవాలేదన్నట్లు చూసి రామం ధైర్యంచెబుతున్నట్లు నవ్వాడు. పిల్లిలావెళ్లి మొహము కడుక్కుని స్నానముచేసి జడవిప్పి ముడిపెట్టుకు అత్తగారు ఏమంటుందో అని జడుస్తూ వంటగదిలో అడుగుపెట్టింది. "పిల్లా, యిప్పుడా లేవటం? ఆ కాఫీలు యిచ్చివచ్చి యీ కూర తరుగు" అంది అత్తగారు తనవేపు చూడకుండానే.

"పిన్నీ అమ్మ కొంచము పువ్వులు తెమ్మంది పూజకి. రామం అన్నయ్య కొయ్యవద్దు అంటున్నాడు చూడు....పిన్నీ పిన్నీ వదిన్ని చూశావా సినిమాయాక్టరులా ముడివేసుకుంది" అంటూ పక్కింటివారమ్మాయి లక్ష్మి తిప్పుకుంటూ చెప్పుకుపోతోంది.

"మీ వదిన సినిమాయాక్టరు, నువ్వునాటకం యాక్టరువీను, సరేనా. వెళ్లి ఆ నందివర్ధనం; మందారపూలూ కోసి నాకు కొంచెం యిక్కడపెట్టి నువ్వు తీసుకువెళ్లు. మీఅమ్మకనిపెట్టుకుంటుంది" అన్నారు అత్తగారు.

* * *

ఆ వేసంగి గడిచింది. మరుదలు వేరేవూళ్లు చదువులకి వెళ్ళారు. రామం ప్యాసయ్యాడు. ఆ వూళ్ళో ఆ ఏడే పెట్టిన కాలేజీలో తండ్రి బలవంతంవల్ల వుద్యోగానికి చేరాడు.

రామం కాలేజినించి రాగానే తండ్రికి సహాయంగా పొలాలదగ్గర కెళ్ళి పన్లు చూడటం, జానకి అత్తగారికి ఇంటిపనుల్లో చేదోడుగా వుండటం- ఒడుదుడుకులు లేకుండా మూడేళ్లు గడిచిపోయాయి.

## తోడికోడలు

పెద్ద మరదికి పెళ్ళి సంబంధం వచ్చింది. అత్తగారు మామగారు వెళ్ళి చూసివచ్చారు. మామగారికి నచ్చలేదు. చదువుకున్నపిల్ల మనమాట ఏమి వింటుంది. నాకు నచ్చలేదన్నారు. "పెళ్ళికొడుకు" వచ్చాక అత్తగారు మళ్ళీ అతనితో అమ్మాయిని చూడటానికి వెళ్ళారు. అతనికి పిల్ల నచ్చింది. అత్తగారికి కట్నం నచ్చింది. "పెద్దకోడల్ని అందం చూసీ, వాళ్లమర్యాద చూసి

చేసుకున్నాం. ఈ సారి పిల్ల చదువూ, వాళ్ళ డబ్బూ చూసి చేసుకుంటున్నాము", అని అడగకపోయినా అందరికి గర్వంగా చెప్పేవారు.

మామగారికి ఎక్కువ ఇష్టంలేకపోయినా వప్పుకోక తప్పలేదు. పెళ్ళి ఏదో అయిందనిపించారు. పెళ్ళిలోపిల్లవేపువారు అత్తగార్ని తప్ప మిగిలిన వాళ్ళని సరిగ్గా చూడలేదు. ఎవరి మట్టుకువాళ్ళు ఎక్కడో వకచోట భోంచేసి ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు. మిగిలిన వాళ్ళల్లో కోడలు జానకి, చెల్లెలు శేషు వున్నారు. వీళ్లకి ప్రత్యేకం నేయించినట్టు ముతక చీరలు తెప్పించి పెట్టారు. కోడలు మాట్లాడకపోయినా శేషు రుసరుసలాడింది.

మళ్ళీ పిల్లలతో వచ్చినవాళ్లకి మాత్రం అత్తగారు, ఎక్కడ లోపం వస్తుందో అని అతిమర్యాదగా చూసి వాళ్లకి ఖరీదయిన బట్టలు తెప్పించిపెట్టి పంపారు. పెద్దమరిది మురళీకి వున్న కొద్దిశలవులూ అత్తారింట్లో గడిపి అక్కడనించి వెళ్ళేటట్టు ఏర్పాటుచేసి తీసుకెళ్ళారు.

మురళీ వేసంగి శెలవకివస్తూ, అత్తవారి వూరువెళ్ళి, భార్యని తీసుకువచ్చాడు. అత్తగారు "చిన్నకోడలికి ఏమి కావాలో చూడు కొత్త దానికి" అని పెద్దకోడలికి పురమాయించింది.

ఆ సాయంకాలం పక్కయింట్లోవాళ్ళు, దొడ్లో కాపురమున్న అమ్మమ్మగారు వచ్చారు. "వదినా? చిన్న కోడలు వచ్చిందటగా ఏది? అని ఒకరూ, "ఏదమ్మా నీకోడలు, ఈసారి ఏమి తెచ్చుకుంది? మాకు చూపిస్తే చూసి సంతోషిస్తాముగా" అని వకరూ అత్తగార్ని అడగటం మొదలుపెట్టారు. "జానకీ సుశీలని ఇలా పిలూ, అమ్మమ్మగారు చూస్తారుట" అన్నారు అత్తగారు.

జానకి వెళ్లింది పిలుద్దామని, గది తులుపులు వేసి వున్నాయి. పిలవటమా వద్దా అని సందేహముతోనే నెమ్మదిగా తలుపు తట్టింది. సుశీల తలుపు తెరవటమే దూకుడుగా తెరిచింది. ఏమి కావాలన్నట్టు కోపంగా చూసింది. అత్తగారు పిలుస్తున్నారు అని చెప్పి జానకి వెళ్ళిపోయింది.

సుశీల గంట తరవాత, "ఎందుకు పిలిచారు?" అంటూ వచ్చింది. అమ్మమ్మగారు "చిన్నకోడలా, నువ్వు తెచ్చినవి చూపిస్తే, చూసి వెడదామని యింతసేపు కూర్చున్నామే" అన్నారు.

ఏమండోయి, మీరు నాకు ఏవిధంగా చుట్టాలో తెలీదు కాని, నన్ను మీరు పేరుపెట్టి పిలుస్తే బాగుంటుంది. దయచేసి "ఏమే" అని "కోడలా" అని మాత్రము పిలవద్దు. మాకు అల్లాంటి అలవాట్లు లేవు" అంది.

"అమ్మమ్మగారు కొంచెం, చిన్నపుచ్చుకున్న మొహముతో "పోనీలే అమ్మా. ఇంక ఎప్పుడూ అలా పిలవను. పెద్దదాన్ని తెలీక అన్నదానికి ఏమీ అనుకోక" అన్నారు.

"అమ్మలూ టైము ఎంత అయిందే" అని జానకిని చూసి అడిగారు- అక్కడనించి వెళ్ళాలి అనే వుద్దేశ్యంతో. జానకి లోపలికి వెళ్ళబోతోంటే "వద్దే అమ్మానేవెడతాను" అని అత్తగారికి చెప్పి అమ్మమ్మగారు వెళ్లిపోయారు.

సుశీల, అత్తగారి కేసిచూసి "ఎందుకు పిల్చారుట. తొందరగా చెప్పండి, ఆయన సినిమాకి వెడదాము అంటున్నారు. ఇందాకా కాఫీ ఏమిబాగాలేదుట. కొంచెం స్ట్రాంగుగా కలిపి పంపమంటున్నారు" అంటూ జానకివేపు చూసింది. జానకి అత్తగారికేసి చూసింది.

"ఇన్నేళ్ళనించి బాగున్న కాఫీ నువ్వురాగానే బాగా లేదు. ఏమో అయినా వాడికి ఎల్లావుంటే బాగుటుందో నీకు తెలుస్తుంది. నువ్వే కలిపిపట్టుకెళ్ళు. ఆ చేత్తో నాక్కూడా కొంచెము యిస్తే రుచిచూస్తా" అంది అత్తగారు.

సుశీల, అత్తగారు తనని చులకనగా మాట్లాడిందనుకుందో ఏమో, మొహం

కందగడ్డలా ఎర్రగా చేసుకుని, కళ్ళు చిట్లిస్తూ, మూతిబిగపెట్టి వొక్క విసురున తిరిగి వెళ్ళిపోయింది.

వచ్చినవాళ్లు ఏమీ అనుకోకుండా, "కొంత అణుకువగా మాట్లాడ్డము తెలీక-అంతేకాని, పిల్లమంచిదే" అని సర్దిచెప్పారు.

"మా జానకి మాత్రము తక్కువదా! అత్తగారికి మామగారికి కలిపిపోసినట్లు వాళ్ళకి ఇస్తే తాగుతారా? పొడి కొంచెము ఎక్కువవేసి కలిపి పంపు" అని జానక్కి నవ్వుతూనే సన్నగా చివాట్లు పెట్టి పంపారు.

వచ్చినవాళ్లు వెళ్ళాక, "మీరు పట్టుకెళ్ళి యివ్వండి" అని కాఫీ కలిపి, గిన్నె తెచ్చి అత్తగారిదగ్గర పెట్టింది జానకి.

"ఇదీ నాకే పెట్టావు" అంటూ చేతులు నేలకానించి, లేచి, గిన్ని పుచ్చుకుని వెళ్ళారావిడ.

## అత్తగారు

ఎంతసేపటికీ అత్తగారు రాలేదు. చీకటి పడుతోంది. జానకి మడికట్టుకు వంట ప్రయత్నంలో పడింది. కంది పచ్చడి రుబ్బడానికి రోటి దగ్గరికి వెళ్ళింది. అత్తగారు గట్టిగా మాట్లాడుతున్నారు. అంతకంటె గట్టిగా తోటికోడలు కంఠంవినిపిస్తోంది. రోటిదగ్గర పని పూర్తిచేసుకు లోపలికి వెళ్ళింది. మామగారు "వంటయిందా?" అంటూ వచ్చారు. నువ్వు చేస్తున్నావేవమ్మా? మీ అత్తగారు ఎక్కడికి వెళ్ళింది?" అన్నారు.

"ఎక్కడికి వెడతాను యేట్లోకి. చిన్నకోడలు సవాలు చేస్తోంటే విని ఆనందిస్తున్నా. తెల్లవారి వచ్చిందో లేదో జీవితమంతా నాతో ఎల్లా గడపటమా అని బెంగపడిందట. అవగింజలో అరభాగం కాలేదు యింకా వాళ్ల యింట్లో వంటవాళ్లతో సమంగా పోలుస్తోంది నన్ను.

మామగారు నవ్వుతూ, "అందులో తప్పేమివుందే! నువ్వు వంటదానివీ, నేను పై పనులు చేసేవాడిని, సరేనా, అప్పడే అయిందనుకోక, మనమలు పుట్టనీ వాళ్లచేత ఏమి అనిపిస్తానో విందువుగాని!"

"చాల్లెండి మీ వేళాకోళం" మీరు అనిపించ నక్కర్లేదు, వాళ్లే అంటారు. మీ మనస్సు తీర్చేందుకు మనుమలు అక్కర్లేదు, కోడళ్ళే తీరుస్తారు... ఏవేఁజానకీ. ఆ పచ్చడి ఎందుకే చేశావు? వాళ్లు తింటారా ఏమన్నానా? ఆ అరటి కాయలు యిల్లా పడెయ్యి తరుగుతా. ఏమి చెయాలో అడిగితే నీ సొమ్మేంపోయింది? -" అంటూ విసుక్కోవడం మొదలు పెట్టారు అత్తగారు.

భోజనాలకి కూర్చున్నారు. సుశీల వచ్చి మురళీ పక్కన విస్తట్లో కూర్చుంది. ఆ పక్కన అత్తగారికి కూడా వడ్డించింది కానీ, "నాకిల్లాపెట్టవే" అంటూ తలుపుకి జార్లపడి గుమ్మం దగ్గర కూర్చున్నారావిడ. అంతా భోజనాలు చేస్తున్నారు. "పచ్చడి చాలా బాగుంది కొంచెం తీసుకురా, అమ్మా జానకీ" అంటూ అత్తగారికేసి చూశారు మామగారు.

"ఎందుకు బాగుండదూ, గిన్నెడు నెయ్యిపోసి వుంటుంది పోపులో. ఇంకవేరే వేసుకో అఖర్లా అన్నంలో. మీరు బ్రతుకు తెరువు తెలిసిన మనుషులు. నాకు అల్లా మొహమ్మొప్పమాటలు చాతకావు" అన్నారు అత్తగారు.

"పచ్చడి ఎల్లా వుందంటే, పంచాంగం చదువుతావేమిటి. నువ్వెప్పడైనా యిల్లా చేశావా చెబుదూ" అంటూ వేళాకోళం చెయ్యటం మొదలు పెట్టారు మామగారు.

"చేతో వాతో చేశాను. ఎల్లాగో గడిచిపోయింది కాలం. కోడళ్ళువచ్చారు. నాకూ సుఖపడాలని వుంది. రేపు చిన్నకోడలిచేత చేపిస్తా; ఆవిడ వంటకూడా రుచిచూడాలని వుంది' ' అంటూ సుశీలవేపు వాడగా చూశారు అత్తగారు.

"అంత సాహసం చెయ్యక, ఎప్పుడైనా జెరంవస్తే జావ బాగా కాస్తుంది. ఏది మొదలుపెట్టినా చివరికి జావగా ముగించగలశక్తి ఒక్క సుశీలకే వుందనుకో" అని నవ్వుతూ మురళి సుశీలవేపు చేశాడు. అత్తగారు గట్టిగా నవ్వుతూ "నువ్వు డాక్టరుగా వచ్చేసరికి వక్కరికి మందుతో అవసరం లేకుండా అందరి రోగాలూ జావతో కుదురుస్తుందందూ...."

"ఏవమ్మోవు జానకీ, ఆపెరగంతా మీ అయనకీ మామగారికీ వడ్డించావా ఏమిటి? అందరికీ చూసి వడ్డించుకోవాలి. కాని ముందు వాళ్లకి దిమ్మరిస్తే, వెనకవాళ్ళ పని ఏవికాను?' ' అంటూ కోపంగా చూశారు.

"ఇవాళ సుష్టుగా భోంచేశా ననుకుంటే నీ కళ్ళు పడ్డాయి. అయినట్టే నాపని. జానకి ఆ వున్న పెరుగంతా మీ అత్తగారికి పోసెయమ్మా. లేకపోతే నాకు జీర్ణంకాదు ఇవాళ" అంటూ మామగారు హేళన చేశారు.

"నాకు వంట రాకపోవచ్చుకాని వడ్డన యింతకంటే బాగానే చేస్తాను. గంటనించి చెయ్యి ఎండిపోతోంది" అంటూ విసుక్కోవటం మొదలు పెట్టింది సుశీల. పెరుగుగిన్ని అత్తగారి దగ్గర పెట్టబోయింది పొరబాటున జానకి. వడ్డన ఆలస్యము అయిందన్న కోపంతో కంచములో నీళ్ళుపోసి లేచిపోయింది సుశీల. అత్తగారు జానకిని గట్టిగానే చివాట్లు పెట్టారు.

జానక్కి ఆపూట భోజనం చెయ్యా బుద్ధిపుట్టలా. అక్కడ పని పూర్తిచేసుకు జానకి తనగదిలోకి వెళ్ళింది. పెరట్లో తల్లీ పెద్దకొడుకు కొంచెము గట్టిగా మాట్లాడుకుంటున్నారు. మామగారు అత్తగార్ని కోప్పడుతూన్నరు. "పోనీ నీ కిష్టములేకపోతే వాళ్ళ వూరుపంపెయ్యి కొంతకాలం నేను వద్దన్నానా?" అని తల్లితో అంటున్నమాటలు జానక్కి ఎందుకో బాదగా తోచాయి. మళ్ళీ మామగారి కంఠము వినిపించింది. "చిన్నకోడలిమీద కోపం జానకిమీద చూపిస్తే ఏం లాభం. అదీ చిన్నపిల్లే, పోనీ కొన్నాళ్లు వంటకి ఆ రాజమ్మగార్ని పెట్టరాదూ, అంటున్నారు. "అవును పాపము యిన్నేళ్ళనించీ ఈ జాలి ఏమయిందో, ఎముకలు చిట్లెము కట్టేట్లు చాకిరీ చేశాను. నన్ను చూసి జాలిపడ్డ వాళ్ళులేరు. మానాన్న యింతో అంతో యిచ్చేపోయాడు" అంటున్నారు అత్తగారు. మామగారు హాస్యధోరణిలో, "ఆ, మీనాన్న యిచ్చింది ఆయన అప్పులవడ్డికి చాలదు' అవి తీర్చలేక చచ్చాను యిప్పటిదాకా."

"పోనీలెండి యిప్పుడు దెప్పుకు ఏమి ప్రయోజనం. యిద్దరము పెద్దవాళ్లమయ్యాము. ఇంకో జన్మలోనయినా అనుకూలమైన భార్య కావాలని మొక్కుకోండి" అన్నారు అత్తగారు ఉక్రోషంగా.

"నేను నిన్ను చేసుకున్నాని ఎప్పుడూ బాధపడలేదు. అంచేత నీకేమయినా అటువంటి బాధలుంటే ఆ మొక్కులు నువ్వే కానియ్యి.

"అబ్బ ఏమిటండీ ఆ మాటలు, మీరు నవ్వుతూ అనే మాటలు ఎవరేనావింటే నిజమే అనుకుంటారు" అన్నారు అత్తగారు. కంఠంమార్చి తరవాత ఏమి అనుకున్నారో, జానకికి నిద్రపట్టింది. జానకికి మెలుకువవచ్చేసరికి, రామం దగ్గరగా కూర్చొని ఎంతో ఆప్యాయంగా వీపు నిమురుతూ ఎందుకు ఏడుస్తున్నావు కల వచ్చిందా?" జానకికి, నిద్రలో ఏడవడం జ్ఞాపకం లేకపోయినా, భర్త ఆప్యాయంగా పరామర్శించేసరికి తల్లిని కౌగలించుకుని ఏడ్చిన పసిపిల్లలా అతని దగ్గరగా జరిగి వెక్కి వెక్కి ఏడ్చింది. రోజులు గడుస్తున్నా జానకి ఇదివరలా ఇంట్లో స్వతంత్రంగా తిరిగేందుకు భయపడుతోంది. అత్తగారు ఏమంటుందో, తోటికోడలికి ఎక్కడ

కోపంవస్తుందో అని బెదురుగా తిరిగేది. ఈమారు, అత్తగారు వేరే విధంగా వూహించుకొని చిన్న కోడల్నిచూసి పెద్దకోడలు నేర్చుకుంటోందని యింకా విసుక్కోవడము మొదలుపెట్టారు.

## అపనింద

ఆరోజు మధ్యాహ్నము రామం కాలేజినించి తొందరగా యింటికి వచ్చాడు. జానకి కాఫీ కలిపి తీసుకువెడుతోంది. మురళీ జామచెట్టు కొమ్మపై కూర్చున్నాడు. రామం గదిలో కిటికీకి దగ్గరగా నిల్చుని మురళీతో మాట్లాడుతున్నాడు. "ముందు ఆ కాఫీ నాకిద్దూ నీకు పుణ్యముంటుంది" అని వంగి అందుకోబోయాడు మురళీ. ఆ సమయానికి సుశీల పెరట్లోకి వచ్చింది. ఎప్పటినించో అణిగివున్న అనుమానము వెఱ్ఱితలలు వేసి వుప్పెనలా పయికివచ్చింది. ముఖము కమలినట్లు అయింది, మీ యిష్టము వచ్చినవాళ్లతో సరసాలాడుతూ వుండేవారుగా. నాకు మొదటినించీ అనుమానంగానేవుంది. ఆవిడని చూస్తే చాలు మీకు ఎక్కడలేని ఆనందమూను, అంతమాత్రము గ్రహించలేను అనుకోకండి" అంటూ వివక్షతలేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతోంది. మురళీ కోపంగా, "తెలివికి సంతోషించాము కాని నోరుమూసుకుంటే మంచిది" అని సుశీలని కసిరాడు. దానితో సుశీల యింకా గట్టిగా "సంతోషించేవాళ్లు ఎదురుగావుంటే నా తెలివి ఏమి కనపడుతుంది మీకు; చదువు సంధ్యా లేనివాళ్లకి యిల్లాంటి తెలివి ఎక్కువ అనుకుంటా" అంటూ, కసిగా జానకికేసి చూసింది. జానక్కి ప్రతిమాటా కాల్చి వాతలుపెట్టినట్టుగావుంది. కాళ్లకింద మట్టి, లోపలికి దిగిపోతున్నట్లు, కళ్లుతిరిగి క్రిందపడేటట్టు--ఎల్లాగో అయిపోయింది. గోడకి జార్లపడి గుడ్లప్పచెప్పి వెఱ్ఱిదానిలా చూస్తు నిల్చుంది. అత్తగారు నిద్దర్లోంచి లేచి వూడినజుట్టు ముడివేసుకుంటూ కొంగు నేలమీద యీడ్చుకుంటూ "మళ్లీ ఏమి కొంపమునిగింది" అంటూ వచ్చారు. సుశీల కళ్లల్లో నీళ్లు లేకపోయినా కంఠధ్వని; ఎగుపులతో, ఏడ్చినట్టు వస్తోంది. "చూడండి వీళ్ల సరసాలు. నేను చూశానని నామీద మండి పడుతున్నారు" ఈధోరణిలో చెప్పుకుపోదోంది. అత్తగారు జానకిని సూటిగా, "రాను రాను మంచిబుద్ధులే వస్తున్నాయి. అయినా మురళీ నీకిక్కడేమిపనిరా, మీ ఆవిడకి యిష్టంలేక పోతే మాట్లాడ్డం మానెయ్యరాదూ? అయినా ఒక కోడలు వచ్చేసరికి యింకో ఆవిడని పుట్టింటికి పంపితే తప్ప యింట్లో వాళ్లం బతికేటట్టులేము" అంటూ జామిచెట్టు దగ్గరికి వచ్చారు.

ఎదురుగా కిటికీలో పెద్దకొడుకుని చూసి తెల్లబోయి నువ్వు యిక్కడ వుండేనా యీరాద్ధాంతమూ" అన్నారు. మళ్లీ పెద్దకొడుకు ఏమన్నా అనుకుంటాడనో ఏమోనని "అయినా కాకపోయినా సుశీలకి నోటికి ఏదివస్తే అది మాట్లాడ్డం అలవాటయింది అపర్దిష్ట ముచ్చటగాపోతే, యిల్లాంటి మాటలా అనటం" అంటూ నేలమీద దులుపుకు కూర్చున్నారు.

జానకి గదిలోకి వెళ్లిపోయింది. "మీరు వున్నారు కనక సరిపోయింది" అంటూ వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టింది. "నేను కొన్నాళ్లు మావూరు వెళ్లనా" అని ఏడుస్తోనే అడుగుతోంది. రామానికి ఎల్లా వోదార్చాలో తెలీలేదు. "నేనంటే కదా నువ్వు బాధపడాలి. వాళ్లమాటలు లెఖ్ఖచేయకూ" అంటున్నాడు. అత్తగారు పెద్ద కేక పెట్టారు. "మురళీ మీ ఆవిడ పడికొట్టుకుంటోందిరా, తొందరగారా" అని, ఆ కేకతో అంతా అక్కడికి పరుగెత్తారు. మురళీ రావటంచూసి, కాళ్లుచేతులూ గట్టిగా నేలమీద బాదుతూ తల అటూ యిటూ కొట్టుకుంటూ దొర్లడము మొదలుపెట్టింది. సుశీల మొహాన నీళ్లు చల్లగా కొంతసేపయినాక సుశీల చేష్టలుమాని కుదురుగా పడుకున్నా బుసకొట్టినట్టు గట్టిగా వూపిరి వదలటం మొదలుపెట్టింది. తనవాత నెమ్మదిగా లేవదీసి గదిలోకి తీసుకువెళ్లారు.

సుశీల లేచి యివతలకి రావటంలేదు. జానకి ఆపక్కకు వెళ్లటంలేదు. అంచేత

గొడవలు లేకుండా నాలుగురోజులు గడిచాయి. సుశీల లేచి తిరుగుతున్నా మురళీ మాత్రం గది విడచి యివతలికి రావటంలేదు.

## శుభకార్యం

ఆరోజు మధ్యాహ్నం అత్తగారు నిద్రపోతున్నారు. వెంకటేశంగారని ఆ వూళ్లో పరపతివున్న పెద్దమనిషి ఎవర్నో వెంటపెట్టుకువచ్చారు. సాధారణంగా ఆయన ఎవరింటికీ వచ్చే మనిషి కాదు. ఏవయినా శుభకార్యాలప్పుడు తప్పరారు. రావటం చూసి తలుపుతీసింది జానకి. వెంకటేశంగారికి జానకి కన్నవారి ఊళ్లో భూములు వుండటం మూలాన అక్కడకివచ్చి నప్పుడు వాళ్ల యింట్లోనే దిగేవాడు. ఆ కారణంగా ఎప్పుడైనా జానకిని చూస్తే చనువుగా మాట్లాడ్డము అలవాటు. "ఏవమ్మా జానకి అల్లా చిక్కిపోయావేమిటి, వంట్లో బాగాలేదా?" అన్నాడు వస్తూనే, జానకి సమాధానంగా చిన్నగా నవ్వి వూరుకుంది. లోపలికివెళ్లి అత్తగార్ని లేపి "వెంకటేశంగారూ యింకా ఎవరోవచ్చారని చెప్పింది". "ఎందుకే మీ మామ గారితో చెప్పు, వాళ్లని కూర్చోమన్నావా? నా పెట్లో గులాబీ చీర జరీది యిల్లా తీసుకురా" అంటూ ఖంగారుగా లేచి తల దువ్వుకోవటం మొదలు పెట్టారావిడ. మామగారికి చెప్పి వచ్చి పెరటి గుమ్మంలో కూర్చుంది జానకి. అత్తగారు ఆ గొలుసు యివ్వవె అని తీసుకుని మెడలో వేసుకుని "రాజమ్మ గారితో కాఫీ పెటమని చెప్పు" అని చెప్పి వెళ్లారు.

వాళ్లు చాలాసేపు వున్నారు. వాళ్లు వెళ్లాక అత్తగారు నవ్వుకుంటూ వచ్చారు. "ఏమేవ్ జానకీ! నీ చిన్నమరదికి పెళ్లి సమ్మంధం తీసుకువచ్చారే. మన గోపీ వెఱ్ఱిబాగులవాడు అనుకుంటాము. వాడు మనకి చెప్పకుండానే వాళ్లు రమ్మంటే వెళ్లి పిల్లని చూసి తనకినచ్చింది అని చెప్పి, మిగిలిన విషయాలు మా వాళ్లతో మాట్లాడమని చెప్పాడుట. జాతకం తీసుకువెళ్లారు. జాతకాలు సరిపోతే పెళ్లి ముహూర్తం వారంలో వుందిట. ఆముహూర్తానికే చేసెయ్యాలి అంటున్నారు. ఏమోసుమా నాకు యింతతొందరగా చెయ్యటం యిష్టంలేదు. ఆఖరు పెళ్లి హడావుడిగా చెయ్యటం యిష్టం లేదు" అన్నారు. అత్తగారు యిల్లా తనతో ఆప్యాయంగా మాట్లాడి చాలాకాలం అయింది. ఆ రాత్రి భోజనాలు, గోపీ పెళ్ళినిగురించిన మాటలతోటి, మామగారి హేళనతోటి కులాసాగా పూర్తి అయ్యాయి. సుశీలకి ఆ రాత్రి మళ్ళీ ఫిట్సు మొదలుపెట్టాయి. అత్తగారు కొంచెము విసుక్కోవడము మొదలుపెట్టారు.

రెండురోజు లయ్యాక అన్నిజాతకాలు కుదిరాయని ఆ ముహుర్తానికే పెళ్లి జరగాలని వాళ్లు అన్నీ సిద్ధంచేసుకున్నారని పెళ్ళి పెద్దలువచ్చి చెప్పివెళ్ళారు.

"అత్తగారు పెళ్ళిహడావిడిలో సుశీల విషయం పట్టించుకోవటంలేదు. జానక్కి కొన్ని పనులు పురమాయించి వాళ్లచేత చేయించమని అత్తగారు బట్టలకొట్లకి నగలకొట్లకి తిరగటంతో పెళ్ళిరోజు దగ్గరకు వచ్చింది. ఆవిడ కొనితెచ్చినవి చూస్తూ మామగారు, "తెచ్చినవాటిలో మూడువంతులు నీ కోసమే తెచ్చుకున్నట్టున్నావే?" అన్నారు. "ఆ నామనసు ఎప్పుడు తీరేనుమరి. మీరు ఎల్లాగ తేరుకనక నేనే తెచ్చుకున్నా" అంటూ మూతితిప్పుతూ హేళనగా చూశారు అత్తగారు.

## కొత్తకోడలు

"ఆ రాత్రి పెళ్ళికి బయలుదేరి వెళ్ళాలి. జానక్కి మధ్యాహ్నంనించి చలితో పెద్దపెట్టున జ్వరమువచ్చింది. అత్తగారికి బెంగపడింది. తను కదలకుండా అన్నీ పెద్దకోడలు చేత జరిపించుకోవటానికికావిడ అలవాటుపడింది. సరిగ్గా యీ సమయానికే జ్వరం రావటం,

తనకంటే ఎక్కువగా కూర్చోటం నేర్చిన చిన్నకోడల్ని తీసుకు పెళ్ళికి వెళ్ళటం అంటే తనకే జ్వరంవచ్చినట్లు భాదపడటం మొదలుపెట్టారు. జానక్కితోడు, వచ్చినబంధువుల్లో పెద్దవాళ్లని యిద్దర్ని వదిలిపెట్టి, పనివాళ్లని యింటిదగ్గర వుండమని అంతా వెళ్ళిపోయారు. మూడవరోజుకి రామం తిరిగివచ్చాడు. జానక్కి యింకా జ్వరంతగ్గలేదు, ఆ రాత్రికి పెళ్ళికూతుర్ని తీసుకువస్తారని గృహప్రవేశం ఆ తెల్లవారుజామునే చెయ్యాలన్నారని తనని ముందు వెళ్ళి కావలసిన ప్రయత్నం చెయ్యమన్నారనీ చెప్పాడు. రామం, వద్దు అంటున్నా జానకి నెమ్మదిగాలేచి యింటిపనులు చేయించటం మొదలుపెట్టింది. ఆ రాత్రి అంతా రావటం, చిన్నకోడలూ అత్తగారూ చిన్నగా మొదలుపెట్టి పెద్దగా గొడవ పెంచుకోవడం చిన్నకోడలికి ఫిట్సుతో, మామగారి కేకలతో తెల్లవారింది. జానక్కి మళ్ళీ జ్వరము ఎక్కువయింది. అత్తగారి కోపము జానకిమీదికి వెళ్ళింది. ఈవంక బాగానేవుంది. ఈవిడకోరోగము ఆవిడకో ఏమీలేనిదాన్ని నేనే అంటూ విసుక్కోవటం మొదలుపెట్టారు.

కొత్తకోడలు మాలతి జంకుభిడియమూ లేకుండా యిల్లు అంతా తిరుగుతూ అందర్నీ ప్రశ్నలు వేస్తూ అత్తగారి దగ్గరికి వచ్చింది. ఎందుకండీ అంతగట్టిగా మాట్లాడుతున్నారూ అంటూ అత్తగార్నే ప్రశ్నించింది. అత్తగారు కొంచెము తెల్లపోయి "ఏమీ లేదులే" అంటూ అక్కడనించి జారుకున్నారు.

చిన్న అత్త మహలక్ష్మిగారు జానకి తగ్గరికి వచ్చి "నువ్వులేచి తిరగకపోతే యిల్లే చిన్నపోయింది" అంటూ అటూ ఇటూ చూసి, "మీ అత్తగారితగ్గ కోడలేవచ్చిందిలే. ఇది అనవచ్చా అనకూడదూ అని లేకుండా యిష్టంవచ్చినట్టల్లా మాట్లాడుతూ మొగరాయుడుగా ఆ తిరగటంచూడు నీమీదలా అధారటీ చలాయించమను బండారం బయటపడుతుంది" అన్నారు.

ఇంతలో అత్తగారు అక్కడికివచ్చి "ఏమిటి ఆగుసగుసలు. అల్లా కూర్చోకపోతే పెళ్ళివారి తాలూకు వాళ్ళకి నీళ్ళు కావాలో ఏంకావాలో కనుక్కోరాదూ" అని ఆవిడని అక్కడనించి పంపేశారు. వాళ్ళ తాలూకుపెట్టెలు జానకి పడుకున్న గదిలోకి మార్పించారు. గోపీ స్నేహితులకి ఓగది కావాలని పెళ్ళి వారితాలూకు వాళ్లని రామంగదిలోకి పిల్చుకు వచ్చాడు. మాలతి వదినగారుట, కాళ్ళజోడూ, కళ్ళజోడూ సవరించుకుంటూ ప్రతిదీ కాళ్లతో పక్కకి నెడుతూ బల్లమీద ఫోటోలో తనని చూసుకొని "ఇంకా రామూ నాఫోటో పెట్టుకున్నాడు' ' అంటూ తీసి చూసుకు మురిసిపోతూ మాలతిని పిలిచి చూపించింది. జానకికి, ఆమాట వింటూంటే ఎందుకో మనస్సు చివుక్కుమన్నట్లు అయింది. వాళ్ళు ఎక్కడికో వెళ్ళే ప్రయత్నంలో బట్టలు మారుస్తున్నారు. రామం ఎందుకో ఆ గదిలోకి రాబోయాడు. సగము కుచ్చీళ్ళు పెట్టుకున్నావిడ ఎదురువెళ్లి 'మీరేనారండి, ఫరవాలేదు' అంటూ రామాన్ని రాసుకున్నట్లు నిల్చుంది, జానకి వోరగా చూసి పక్కకి తిరిగి పడుకుంది. వాళ్లు ఎప్పుడు వెళ్ళారో జానక్కి తెలవదు. నీరసంతో నిద్రపట్టింది. మెలకువ వచ్చేసరికి మాలతి గందర గోళంగా మాట్లాడుతూ, తనని పరుపుచుట్ట దొర్లించినట్లు దొర్లిస్తుంది.

పెరట్లోవున్నది ఏమయిపోతుంది, మీరు యిక్కడే వున్నారుగా" అంటూ ప్రశ్నలు మొదలుపెట్టింది. జానకికిగుండె గబ గబా కొట్టుకోవటం మొదలుపెట్టింది. తనకి ఏమిటో అర్థంకాక తెల్లబోయి చూస్తోంది. ఆ గొడవ అంతా చుట్టూ మూగారు. ఎవరో యేమిపోయింది. అన్నారు. "ఏం పోవడం ఏమిటి నా నెక్లెసు వెయ్యిరూపాయిల్ది పోయింది" అంటూ అక్కడవున్న పెట్టెలన్నీ కెలికి, జానకి పెట్టె బోర్లించింది. అందులో బొమ్మని విసరికొట్టింది. "ఎక్కడ పెట్టారో యిచ్చెయ్యండి. ఇంక ఎవరు వస్తారు కొత్తవాళ్లు" అంటూ జానకిమీద విసుక్కోటం

మొదలుపెట్టింది. జానకికి నీరసంమీద ఎక్కువ దుఃఖం వచ్చి ఏడుపు మొదలుపెట్టింది. తన బొమ్మని తీసుకు విరిగిన చెయ్యి సవరించుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది. మాలతి గట్టిగా, "ఏడుపు కట్టిపెట్టి నాది నాకివ్వండి" అంటోంది అప్పుడే వస్తున్న వదినగారు తిప్పుకుంటూ "ఏమిటి మాలతీ గొడవా" అంటూ వయ్యారంగా నిలబడింది. "గొడవ ఏమిటి, నా నెక్లెసు తీసుకుని ఇవ్వటంలేదు" అంది. అంతలో రామంవచ్చి "ఎవరు తీసుకున్నా"రని అడిగాడు. "ఎవరు తీసుకోవటం యేమిటి, ఆవిడే కనపడటంలా?" అని జానకిని చూపించింది.

"నీకు ఊరికే తొందర. ఇందాకా నువ్వేగా నా చేతి కిచ్చావు" అంటూ తన మెడలోది తీసి యివ్వబోయింది వదినగారు. "ఉండనీలే" అంటూ మాలతి తన పెట్టెలు మళ్ళీ సర్దుకోవటం మొదలుపెట్టింది. చిరచిరలాడుతూ అప్పటిదాకా వింత చూస్తున్న వాళ్ళు అంతా తలోమాటా అని వెళ్ళి పోయారు. అత్తగారు చివరిదాకా తనకి అర్థమేకానట్లు "తియ్యలేదని చెప్పవద్దటే జానకీ" అంటూ వెళ్ళిపోయారు. రామం తనవేపు మాట్లాడుతారు అనుకుంది జానకి. తనని వోదారుస్తాడనుకుంది. అది యేమీ లేకుండా వక్కమాటకూడా అనకుండా వెళ్ళిపోవటం జానక్కి యెందుకో చాలబాధగా తోచింది. నెమ్మదిగా లేచి, తనవన్నీ క్రిందవి తీసి పెట్టెలో పెట్టుకుని అప్పలమ్మ ఆసరాతో వెనకవేపు వసారాలోకి తన పక్క మార్చుకుంది. సాధారణంగా అక్కడికి ఎవరూ రారు. పాలు పితేందుకు వస్తేతప్పయింటివాళ్లు ఎవరూరారు. జానకి ఆలనాపాలనా కనుక్కున్నవాళ్ళే లేరు. అప్పలమ్మే వంటావిడని అడిగి కాఫీ తెచ్చి బలవంతంగా తాగించింది. జానక్కి ఎన్నో ఆలోచనలు వచ్చాయి. ఎప్పుడు రామంతో మాట్లాడకూడదని తనకీ రామానికీ సంబంధం తీరిపోయిందనీ, రామానికి తనమీద ఇష్టములేదనీ, ఉంటే ఎవరయినా భార్యపైన దొంగతనము వేస్తే విని వూరుకుంటారా అని అనుకుంది. నిన్న కాకమొన్న పెళ్ళయినా, గోపీ, ఇంత రభసచేసినా తన భార్యని ఏమీ అనలేదు. అన్ని మాటలు అన్నా విని ఊరుకున్నాడు. మొదటినించీ రామానికి తనమీద ఇష్టంలేదనుకుంది. అందుకు నిదర్శనాలెన్నో గుర్తుకు తెచ్చుకుంది. ఈ యింట్లో తనంటే ఎవరికీ యిష్టం లేదని తనని వక పనిమనిషిక్రింద వుపయోగించుకుంటున్నారని యిల్లా ఏవేవో వూహించుకుని, యిష్టము వచ్చినంతసేపు ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

* * *

మెలుకువ వచ్చేసరికి చాలా ప్రొద్దుపోయినట్టుంది. చుట్టూ చీకటి. చిన్నదీపము మెట్టపైన పెట్టివుంది. తనదగ్గరలో అప్పలమ్మ నిద్రలో చేసేచప్పుడు పిల్లులు దెబ్బలాడినట్టు వినిపిస్తోంది. పాకలో పశువులు కదలి చప్పుడు, గడ్డిశబ్దము వినపడుతున్నాయి. కీచురాళ్ళ చప్పుడు అంటే తనకంతొ భయము. కళ్ళు తెరచి చుట్టూచూస్తున్నా వూపిరి తీసేందుకు భయమేసి అటూ ఇటూ చూస్తూ బిగుసుకు పడుకుంది. కొంతసేపటికి అడుగుల అలికిడి అయినట్లు తోచింది. వెంకడు దూడలకి గడ్డివేసేందకు వచ్చినట్టున్నాడు. వోరక్కడ అంటూ అప్పలమ్మని లేపాడు. 'నీకోసం పెద్దమ్మగోరు యిల్లుపోయేటట్లు కేకలు వేస్తూంటే నువ్వు యీడ నిద్రపోతుండావు' అన్నాడు. "ఏం నాతో ఏంపనొచ్చే ఆళ్ళంతా వున్నారుగా, పెద్దకోడలు గారు యీడ ఒంటిగా పడుకుంటే నేనీడకూకుండా' అంది సర్లె పోయిచెప్తాలే అంటూ కీచురాళ్ళల్లా చెప్పులు కిర్రుకిర్రు శబ్దచేసుకుంటూ వెళ్ళాడు. దూరంగా గంటలశబ్దం వినపడ్డప్పుడు లెక్క పెట్టుకుంటూ చీకట్లోకి అలాచూస్తూ పడుకుంది.

నుదురుమీద చల్లగా చెయ్యి తగిలేసరికి భయమేసి అరవలేక గట్టిగా మూలిగింది.

అప్పలమ్మ ఏవమ్మా అంటూ లేచి, "వోరారుమీరా.... పెద్దబ్బాయిగారు వచ్చారు లెగండి లోపలికి పోదము" అంటూ లేచి చాపపట్టుకు బయలుదేరింది. "మీరు పిల్చుకురండి అమ్మాయిగార్ని" అంటూ అది వెళ్ళిపోయింది. రామం చెయ్యితీసి పక్కనపెట్టి దూరంగా జరిగింది జానకి. "అబ్బా ఎంతవేడిగా వుంది" అంటూ తనపై కండువాతీసి కప్పి ఎంతో ఆప్యాయంగా చెంపలునిమిరి "కిందకి జరక్క, అంతా మట్టి" అని చాపమీదకి జరిపాడు తనని. తను అనుకున్న వన్నీ మరచిపోయి పిల్లి పిల్లలా ఒదిగి పడుకుంది జానకి. "అబ్బా నువ్వెక్కడా కనపడకపోతే భయంవేసిది" అంటూ దగ్గరగా తీసుకున్నాడు. జానకి దూరంగా వెళ్ళేందుకు ప్రయత్నించింది. వాళ్ళేదో అంటే నామీద కోపమైతే ఎలా అన్నట్టు జరిగిపడుకున్నాడు. అన్ని కోపాలూ చీకట్లో కలిసి కరగిపోయాయి.

తెల్లవారుతోంది. జానకి బద్ధకంగా కళ్ళు తెరవకుండా పడుకుంది. తండ్రికొడుకల సంభాషణ వినపడుతోంది. "కొంతకాలం వాళ్ళవూరు పంపుదామనుకుంటున్నాను. నాన్నగారూ మీరేమంటారు!" అంటున్నాడు రామం "అన్ని గొడవలూ వింటూనేవున్నా., మీఅమ్మ మనసు తీర్చేకోడలే వచ్చిందిలే. చిన్నప్పటినించి ఎరిగివున్న పిల్లకావడంనించో ఏమో జానకి నాకు కూతురులావుంటుంది కాని కోడలులా అనిపించదు., అమ్మాయి వెడుతుందన్నా నాకు ఏమిటోలా వుంటుంది. పోనీ కొన్నాళ్లు మీరు యిద్దరూ వెళ్ళివుండిరండి అసలు నీకు చెబుదాము అనుకున్న మాటమార్చి. కొత్తవియ్యంకుడు, రెండోవాడి మామగారు పెళ్ళిలో మాట్టాడుకున్నారట. ఆస్తి ఎవరిది వాళ్ళకి పంచేస్తే బాగుంటుందని. ఇంక చేసే కార్యాలూ ఏమీ లేవాయిని, ముగ్గురివీ చదువులుకూడా పూర్తయ్యాయి కనక పంచిపెట్టడంలో ఏమీ యిబ్బంది వుండకపోతే అట్లాచేస్తే బాగుంటుందని వాళ్ళచుట్టము- ఆ నల్లగా పొడుగ్గా ఉన్నాడే - ఆయనచేత నాకు తెలియపరిపించారు. నాకు వళ్లుమండింది. అయినా పైకి ఏమి అనలేదు. దానిదేంవుందిలెండి. ప్రస్తుతము, నేను ఏమీ అనుకోలేదు. నాకు ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు మీకు తెలియపరుస్తా. అవసరమైతే వారి సలహాతో బాటు మీ సలహా కూడా తీసుకుంటా. ఇల్లా అన్నాని తెలియచెయ్యండి వాళ్లకి" అన్నా. ఇప్పుడే వీళ్ళకి ఆస్తిమీద కన్నుపడిందే. వీళ్లు మమ్మల్నేమి చూడనిస్తారంట మా బ్రతుకు కడతేరకినట్టే.... "మీ అత్తారు యిన్నేళ్ళు అయింది. మాట వరసకైనా ఎప్పుడైనా అన్నారా? పాపము జానకి నగలమ్మి పొలముమీద పెడితే కూడా వాళ్ళు ఆ సొమ్ములు ఏమయినాయనికూడా అడగలేదు. మనము ఎప్పుడు పంపమంటే అప్పుడు పంపి, ఈ రోజుకికూడా వాళ్ళు అంత అగ్గగ్గలాడుతూ వుంటారు. పెద్దలు వూరికే అనలేదు. "కులమింటికోతిని తెచ్చుకోమని" నువ్వు వెడితే మీ మామగార్ని ఒకసారి రమ్మనిచెప్పు. ఆయన సలహా తీసుకు పంచి పారేస్తాను. ఒకవేళ నాకీ వుద్దేశ్యము వాళ్ళు అడిగారని రాలేదు. నువ్వూ జానకీ అయినా సుఖంగా వుంటారని,. నాకేంకావాలి. రామక్రిష్ణ అంటూ కూర్చేక, మీ అమ్మకి కావాలంటే ఆ కోడళ్ళ దగ్గర మనస్సు తీర్చుకోమను. కానీ నేను మాత్రము మీదగ్గరే వుంటానుసుమా" అంటూ చెప్పుకుపోతున్నారు మామగారు.

"ఏమిటి నా విషయము పెద్దకొడుకుతో యింత ప్రొద్దున్నే వ్యాఖ్యానం చేస్తున్నారు ఏమిటి" అంటూ అత్త గారి కంఠం వినిపించింది.

"ఏవుంది. నీ కొత్త వియ్యంకుళ్ళు యిద్దరూ కూడబలుక్కుని అపూర్వమైన సలహా పంపారు. ఆస్తిపంచితే బాగుంటుందని".

"వోసి యింతేనా. ఇంకా ఏదో కొపమునిగే రహస్యం అనుకున్నా" అన్నారు అత్తగారు.

"ఈ మాటే పెద్ద వియ్యంకుడు అనివుంటే నన్నూ వాళ్లనీకూడా తిట్టిపోసేదానివి.

వీళ్ల గొప్పవాళ్ళనీ, వాళ్ళన్నది కాదంటే ఏమనుకుంటారో అనీ వాళ్ళు అన్నదానికల్లా తాళం వేస్తున్నావు. కొంతకాలం ఆ కోడళ్ళని పెట్టుకువుండు. అప్పుడు బైటపడుతుంది బండారం" అన్నారు మామగారు.

"నాకేమిఖర్మ వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గరా వుండేందుకు. నాకు ఎవరూ పెట్టఖ్కరలేదు. నా తండ్రి యిచ్చింది నాకుంది. హాయిగా డబ్బు పారేసి మనిషిని పెట్టి చేయించుకొంటాను. మీరునన్ను ఏమీ దెప్పఖ్కర్లేదు" అని అత్తగారు అంటున్నారు.

"సర్లే నీ గొప్పలు తరవాత చెపుదువుగాని, రామాన్ని, జానికిని వాళ్ళవూరు తీసుకువెళ్ళమన్నా. ఏంకావాలో చూడు".

"బాగానే వుంది మీ సలహా. యింటినిండా చుట్టాలు వుంటే, కోడల్ని కొడుకునీ పంపుతానంటా రేమిటి? ఎవరైనా వింటె నవ్వుతారు వూరుకోండి".

నాలుగైదురోజులు గడిచాయి. ముఖ్యమైన ,చుట్టాలు వకళ్ళూ, యిద్దరూవున్నా, అంతా వెళ్ళిపోయారనే చెప్పవచ్చు. మామగారు ఒకరోజు ప్రొద్దు ఎక్కి, బండినిండా ఏవేవో క్రొత్త సామానుపెట్టుకువచ్చారు. మొదట అంతా ఎవరో, చుట్టాలు వచ్చారేమోనని ఎదురువెళ్ళి, మామగారు రావటం చూసి యిదేమిటి, యీసామను అంటూ వింతగా చూస్తూ నిల్చున్నారు. మామగారు గంభీరంగా ఎవరితో మాట్లాకుండా ఆ సామాను అంతా మాగదిలో పెట్టించి "జానకీ మీ కొత్త కాపరానికి యింకేవేంకావాలో చూసుకో" అంటున్నారు. అత్తగారు అక్కడికివచ్చి "ఇవన్నీ యింట్లో లేవనే తెచ్చారా? ఇలాంటి పిచ్చిపన్లు చేసి, నెత్తిఎక్కించుకుంటే తరవాత వాళ్ళకి ఏమి గౌరవం వుంటుంది. మన మీద? నేను రేపు గోపీబార్యని తీసుకుని వాడిదగ్గరికి వెడుతున్నా. నేలేకపోతే ఎల్లా చూస్తుందో మీకు తెలిసి రావాలి" అంటూ కళ్ళూ ముక్కూ తుడుచుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయారు. మర్నాడు నిజంగానే అత్తగారు గోపీ భార్యను తీసుకుని అతని దగ్గరికి వెళ్ళిపోయారు.

ఇంటి బాధ్యత అంతా జానకిమీద పడేసరికి మొదట కొంచము బెంగగా వున్నా కొద్ది రోజుల్లోనే అలవాటుపడి, మామగారికి ఏమి లోపము వస్తుందో అని జాగ్రత్తగా చూసుకుంటూ ఇల్లు చక్కబెట్టుకుంటూ కాలం వెళ్ళబుచ్చింది. తను ఒక్కర్తీ చేసుకోలేదేమోనని రామంకూడా జానకికి కొన్ని పనుల్లో సహాయపడుతూంటే ఏదో కొత్తగా అదోరకమైన ఆనందంగా వుండేది. నాలుగైదు నెలలు గడిచాయి. గోపీదగ్గర నించి మామగార్కి వుత్తరం వచ్చింది. కోడలికి అత్తగార్కి వక్క నిమిషము పడటంలేదని అంచేత "మీరు వచ్చి అమ్మని తీసుకు వెళ్ళాలి" అనీను. మామగారు వెళ్ళటమా, మానటమా అని ఆలోచనలో రెండు రోజులు గడిపారు. ఆరోజు గోపీ దగ్గరనుంచి టెలిగ్రాము వచ్చింది. తల్లిని తీసుకు తనే బయల్దేరి వస్తున్నట్లు.

"అమ్మ వస్తోందనిబెంగా; అల్లా ఆవదము తాగినట్లు పెట్టావు మొహం?" అన్నాడు, రామం. జానకి కేసి చూసి నవ్వుతూ.

"బాగానే వుంది, ఎవరైనా వింటే ఏమనుకుంటారు. ఇంతకీ ఎప్పుడు వస్తు న్నారు!' ' అంది జానకి సంభాషణ మార్చాలని.

ఆ మర్నాడు అత్తగారు, గోపీ వచ్చారు. భోజనాల దగ్గర మాటల మధ్యలో "గోపీకి డబ్బు కావాలిట్దేన్నికో పరీక్షకి కడుతాడుట" అని అత్తగారు చెప్పబోయారు. నాక్కావలసింది నేను అడిగితీసుకుంటా. నువ్వు భోజనం కానీ ముందు అని తను లేచి వెళ్ళాడు గోపీ. ఇదీవరస అన్నట్టు మామగారికేసి చూశారు అత్తగారు.

"రామంకూడా యిక్కడ వుండడుట. వాడికి వేరే వుద్యోగము వచ్చిందట. ఈ రోజే

తెలిసింది. మన మిద్దరం ఏమి వుండగలం యిక్కడ" అన్నారు విచారంగా జానకేసి చూస్తూ మామగారు.

"మీరూ మాతోటే వస్తారు" అంది జానకి.

"మీరు అంటే మామగారు వక్కరు అనా అర్ధము" అన్నారు నవ్వుతూ అత్తగారు.

"మీరు అంటే యిద్దరూ అనీలే. నువ్వు మనుమణ్ణి ఆడిస్తే నేను బజారుపనులుచేసి కాయగూరలు తెచ్చిపెడతా. ఇద్దరికీ వేళకి యింత వండిపెడుతుంది జానకి. అంతేనా" అన్నారు మామగారు.

కొంగుతో మూతి మూసుకు నవ్వు ఆపుకుంటూ, గోడ పక్కకి తప్పుకుంది జానకి.

గోపీ రెండు రోజులు వుండి వెళ్లాడు. రామంకూడా వెళ్ళాల్సి రోజు వచ్చింది. జానకిని వాళ్ళ వూరు పంపి వెడతానని తల్లితో చెప్పడానికి వచ్చాడు. "ఉన్న వూళ్ళో జీతము తక్కువైతే మాత్రము ఏమిరా వెళ్ళటము మానెయ్యకూడదా" అన్నారు ఆవిడ ఏదో బాధగా. "మానెయ్యడము ఏమి కష్టం. ఎప్పుడు యిష్టములేకపోతే అప్పుడే వచ్చెయ్యవచ్చు. అక్కడ అన్నీ చూసి ఇల్లు దొరికాక రాస్తాను. జానకిని తీసుకుని నువ్వు, నాన్నగారూ రండి" అన్నాడు రామం.

జానకి అత్తగారికి మామగారికి నమస్కరించి బండి ఎక్కింది. అత్తగారు కళ్ళనిండా నీళ్ళతో అటూ యిటూ చూస్తున్నారు. సాధారణంగా ఆవిడకి ఎవర్కు వచ్చినా ఎవరు వెళ్ళినా కళ్ళల్లో నీళ్ళు రావటం చూడలేదు. రామం మళ్ళీ తల్లితో వస్తానని చెప్పి బండి ఎక్కాడు. తల్లి నోట్లో మాట రాక తలవూపి పెదములు బిగించి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంది. స్టేషనులో మామగారు. మేము రావటము ఆలస్యము అయినందుకు ఖంగారుపడుతున్నారు.

రైలు కదిలేదాకా అటు యిటు చూసి కొంత డబ్బు తీసి కొడుకు చేతిలో పెడుతూనేవున్నారు. "ఇంకవద్దు నాన్నా, సరిపోతుంది".

"దూరం వెడుతున్నావు దగ్గిర వుండటం మంచిది. అమ్మాయికి కూడా కొంత యియ్యి దగ్గర పెట్టుకోమని" అన్నారు మామగారు.

రైలు కదిలింది. కండువాతో కళ్ళు వత్తుకుంటూ "జాగ్రత్త" అంటూ హెచ్చరిక చెబుతూ రైలుతో కూడా కొంతదూరం నడిచి నిలిచి కనపడేదాకా చూస్తూ వుండి పోయారు.

"మీ నాన్నగారికి మీరంటే చాలా యిష్టం మిమ్మల్ని విడిచి వుండలేరు" అంది జానకి.

"మా అమ్మకి నువ్వంటే అపేక్ష. నిన్ను ఎప్పుడు వూరికి పంపాలన్న ఆవిడకి కోపము వస్తుంది. గోపీ చెప్పాడు అక్కడ అస్తమానం నీ గొడవే చెప్పేదిట. ఆ అమ్మాయికి కోపం వచ్చి, "ఇక్కడి కెందుకు వచ్చారు. అక్కడే వుండకా" అనేదిట. సరే నాన్నకి నేనంటే అమ్మకి నువ్వంటే, మరి-నీకు?"

అతన్నే చూస్తూన్న కళ్లు కిందికిదింపి కాలిబొటనవేలు పెట్టికిందరాస్తూ, "నేను యిప్పుడు మావూరు వెళ్ళకుండా మీతో వస్తేయేం?" అంది జానకి. ఇంతలో స్టేషను దగ్గిరికి వస్తోన్నట్టు, పడిపోయే పాకలూ ఆ పక్కగా అయ్యరు చిన్న హోటలులో గ్రామఫోను చేసే గొడవ, రైలు శబ్దంలో కలిసినా, కొన్ని మాటలు వినపడుతున్నాయి.

రైలు ఆగటం నాన్న ఆత్రంగా వెతుకుతూ, "అమ్మడూ దిగు టైమైపోతోంది' అంటూ వచ్చారు. తను దిగి సామాను దించేసరికి రైలు కదిలింది. కమ్మీలు పట్టుకు కింద చెక్కపైన కాలుపెట్టి వెడతానన్నట్టు తల వూపుతూ తనకేసి చూస్తూన్నారాయన. "పడతారు లోపలికివెళ్ళం'

'డని కళ్ళతో భయపడుతూ తను చూడటం నాన్న గ్రహించి "భయంలేదులే" అని నవ్వాడు. రైలుతో కూడా తనూ నడుస్తూ జాగ్రత్తగా వెళ్ళమనీ వెళ్ళగానే వుత్తరం రాయమనీ చెబుతూ, రైలు వేగం హెచ్చేసరికి అక్కడే నిలబడి, కనపడేవరకూ చూస్తు ఉండిపోయింది. నాన్న చూడకుండా కళ్ళు తుడుచుకొని కంట్లో ఏదో పడ్డట్టు నటిస్తూ, బెంగకుండా నాన్నతో మాట్లాడుతూ బండిఎక్కి ఇంటికి బయల్దేరింది జానకి.

✧